బాబు మోసపూరిత పాలనను తిప్పికొట్టాలి

చినమిల్లి వెంకట్రాయుడు

భీమవరం అర్బన్: ఎన్నికల సమయంలో నెరవేరని హామీలు ఇచ్చి తీరా అధికారం చేపట్టాక అన్ని వర్గాల వారిని మోసం చేసిన చంద్రబాబు మోసపూరిత పాలనను కలిసికట్టుగా తిప్పికొడదామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు అన్నారు. మండలంలోని వెంప, శ్రీరామపురం, పెదగరువు గ్రామాలల్లో బుధవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ ఒకసారి ఓటేసి ఐదేళ్ల శిక్ష అనుభవిస్తున్నామని ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ రాష్ట్ర ప్రజలను మళ్లీ చంద్రబాబు మోసం చేశాడని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులు పాలు చేయకుండా సంపద సృష్టిస్తానని చెప్పి ఏడాదిన్నర పాలనలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. ఏడాదిన్నరలోనే సుమారు రూ.లక్షా 60 వేల కోట్లకుపైగా అప్పుల ఊబిలోకి గెంటివేశారన్నారు. ఏడాదిన్నర పాలనలో చంద్రబాబు ఏడాదికి 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తానని గత ప్రభుత్వంలో జగనన్న ఇచ్చిన 2 లక్షల 60 వలంటీరు, ఎండీఎం డ్రైవర్లు, వైన్ షాపుల్లో చేస్తున్న వారి ఉద్యోగాలతో కలిపి సుమారు 3 లక్షలు మంది ఉద్యోగాలు పీకేశారన్నారు. నిరుద్యోగులకు భృతి నెలకు రూ.3 వేలు ఇస్తానని ఏడాదిన్నరైనా ఇవ్వకుండా మోసం చేశారన్నారు.



పెదగరువులో పార్టీ గ్రామ కమిటీలతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న చినమిల్లి వెంకట్రాయుడు

విచారణ పేరిట పింఛన్‌దారులకు అన్యాయం

నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ చంద్రబాబు అధికారం చేపట్టాక 75 లక్షల 50 వేల మందికి పెన్షన్లు ఇవ్వాల్సి ఉండగా విచారణ పేరిట 8 లక్షల 58 వేలు పెన్షన్లు తీసి వేశారన్నారు. ఉచిత బస్సు పేరుతో కొన్ని బస్సుల్లో మాత్రమే మహిళలకు పరిమితం చేసి మోసం చేశారన్నారు. తల్లికి వందనం రాష్ట్రంలో 82 లక్షల మంది విద్యార్థులు ఉండగా 20 శాతం మందికి ఖాతాల్లో జమకాలేదన్నారు. పేదలకు ఆరోగ్య శ్రీ అందకుండా రూ.4500 కోట్లు బకాయిలు పెట్టి పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. చంద్రబాబుకు మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావులు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. కరోనా సమయంలో 2 సంవత్సరాలు ఏ ఒక్క సంక్షేమ పథకం ఆపకుండా అమలు చేస్తూ, ఇంటింటికి దాతలతో కూరగాయలు పంపించి తెల్లరేషన్ కార్డు ప్రతి కుటుంబానికి రూ. వెయ్యి చొప్పున ఇచ్చారని గుర్తు చేశారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసే వరకు ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. అనంతరం గ్రామ కమిటీలను నియమించి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, భీమవరం మండల, పట్టణ అధ్యక్షులు జల్లా కొండయ్య, గాదిరాజు రామరాజు, వీరవాసరం మండల అధ్యక్షుడు చవ్వాకుల సత్యనారాయణ, నాయకులు దాట్ల శ్రీనివాసరాజు, సానబోయిన సత్యనారాయణ, పెచ్చెట్టి రాము, చిలకపాటి ఆదాము, ఇంజేటి ప్రభాకర్‌రావు, ఒడుగు సురేష్, కోడే యుగంధర్, పెనుమాల నరసింహస్వామి, బేతాళ సంతోష్, అల్లూరి రవికుమార్ రాజు, గొట్టుముక్కల పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థికి మెరిట్ స్కాలర్‌షిప్



మనోజ్ కుమార్

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థి తారా మనోజ్ కుమార్‌కు థర్డ్ ఇయర్ వరకు అత్యధిక మార్కులు (9.24 సీజీపీఏ) సాధించడం వాడపల్లి వి.రామకృష్ణ మెమోరియల్ యాన్యువల్ మెరిట్ స్కాలర్‌షిప్ పొందాడు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు చేతుల రూ.10 వేలను మనోజ్ కుమార్‌కు అందించారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగం హెడ్ డాక్టర్ ఎస్.ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి హాకీ పోటీలకు విద్యార్థి ఎంపిక



జాయ్ వెస్లి

భీమవరం: తణుకు డిగ్రీ ఆర్ట్స్ కాలేజీలో ఈ నెల 9న నిర్వహించిన జిల్లా హాకీ సెలక్షన్స్‌లో విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన కె.జాయ్ వెస్లి ఎంపికయ్యాడు. ఈ నెల 21, 22 తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ యం. శ్రీనివాసరావు బుధవారం విలేకరులకు తెలిపారు. తెలిపారు. ఈ సందర్భంగా జాయ్ వెస్లిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.

ప్రపంచ శాంతితో మానవ మనుగడ సాధ్యం



శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి: ప్రపంచమంతా శాంతియుతంగా జీవిస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. బుధవారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండి సెంటర్‌లో సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులు మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రపంచశాంతి అనేది ఎన్నో ఏళ్ల నినాదమని అది ఎప్పటికీ అవసరమేనని అన్నారు.కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గాదిరాజు రంగరాజు, చైర్మన్ రుద్రరాజు యువరాజు, కో–చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, కన్వీనర్ కొమ్మన నాగబాబు, పరంశెట్టి ఆంజనేయులు, చింతాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావేదిక

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఇకపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించేవారని, అర్జీదారులు మార్పును గుర్తించి సహకరించాలని కోరారు.

చోరీ యత్నం చేసిన బాలుడి అరెస్ట్

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామంలో గొలుసు దొంగతనానికి పాల్పడుతూ ఒక మైనర్ బాలుడు బుధవారం పట్టుబడ్డాడు. ఇండియన్ బ్యాంకు సమీపంలో చేగొండి నాగవేణి అనే మహిళ తన ఇంటిలో ఉంది. ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన బాలుడు (16) కత్తితో బెదిరించి మెడలో బంగారువస్తువులు తస్కరించేందుకు ప్రయత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు బాలుడిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బాలుడిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు.

త్వరలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

నరసాపురం: పట్టణంలోని చినమామిడిపల్లి రైల్వే గేట్ వద్ద పాదచారులు, ద్విచక్రవాహనదారులు ప్రయాణించడానికి వీలుగా నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. బుధవారం బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. గేట్ సమస్య పరిష్కారానికి మూడేళ్లక్రితం బైపాస్ రోడ్డు నిర్మించడంతో గేట్‌కు అవతల, ఇవతల ప్రాంతాల వారు రాకపోకల విషయంలో దూరం పెరిగి ఇబ్బందులు పడుతున్నారని ఆర్డీఓ చెప్పారు. ఇరు ప్రాంతాల వారికి వెలుసుబాటుగా ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ అంగీకరించిందన్నారు. ఆయన వెంట రైల్వే అధికారులు మయాన్ ఉపాధ్యాయ, పీఎంకే శాస్త్రి, మధుబాబు, ఇరిగేషన్ డీఈఈ బి.మోహనకృష్ణ, ఆర్అండ్‌బీ ఏఈ కె.ప్రసన్న బాబు, నరసాపురం తహసీల్దార్ అయితం సత్యనారాయణ ఉన్నారు.

కొల్లేరు సర్వేపై సమీక్ష

ఆకివీడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కొల్లేరు సర్వేపై భీమవరం రెవిన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. కొల్లేరు తీరంలోని ఐదో కాంటూర్ సరిహద్దుల్ని నిష్పక్షపాతంగా గుర్తించి, ఎర్రజెండా పాతాలని ఆదేశించారు. జాయింట్ సర్వే త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. తర్వాత శాశ్వతంగా సర్వే రాళ్లు పాతాలని సూచించారు. గత వారం రోజులుగా మండలంలోని కొల్లేరు. తీరంలోని ఐదో కాంటూర్ భూములలో జియోట్యాగ్ సర్వే కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ జాషువా, డివిజనల్ సర్వేయర్ మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గీత కులాల బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో గీత కులాల రిజర్వ్‌డ్ కేటగిరీ (గౌడ) లో వారికి బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 29వ తేది సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 5 లక్షలు రుసుము, రూ. 10 వేలు దరఖాస్తు ప్రాసెసింగ్ రుసుములుగా చెల్లించాలని తెలిపారు. డ్రాలో బార్ దక్కించుకున్న వారికి గీతకులాల రిజర్వు కేటగిరి బార్‌లో భాగంగా లైసెన్సు ఫీజులో రాయితీ ఇవ్వడం ద్వారా రూ.27.50 లక్షలు సంవత్సరం రుసుముగా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి నూతన పాలసీ బార్ విధానం ప్రారంభమవుతుందని వివరించారు. 2025–2028 వరకూ మూడేళ్లు కాలపరిమితి ఉంటుందని, ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకూ అమ్మకాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి అని ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యుత్ వినియోగంలోనూ, దీపారాధనలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మండపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, శబ్దకాలుష్యం లేకుండా, అసభ్యకర ప్రదర్శనలు, నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వీలైనంత వరకు మట్టి విగ్రహాల్ని ఏర్పాటు చేసి కాలుష్య నియంత్రణకు సహకరించాలని జగదీశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, విద్యుత్ ఏఈ రత్నాకర్, ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కాళ్ల: నిర్వహకులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాసరావు



ఆకివీడు: మాట్లాడుతున్న రూరల్ సీఐ జగదీశ్వరరావు



ఉండి: మాట్లాడుతున్న ఎస్సై ఎండీ నసీరుల్లా

ఉండిలో..

ఉండి: మండలవ్యాప్తంగా ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించే వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాల్‌లో ఉత్సవాల నిర్వాహకులతో ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినాక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా డీజేలు, భారీ బాణసంచాలకు ఎలాంటి అనుమతులు లేవని అన్నారు. అనుమతులతో ఏర్పాటు చేసే వినాయకుని మండపాల వద్ద రాత్రి వేళల్లో వలంటీర్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే మండపాలను రోడ్లపై ఏర్పాటు చేయకుండా అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీఓ శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి సూర్యబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: ప్రజలు నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో వినాయకచవితి మండపాల నిర్వాహకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ముందస్తు అనుమతితో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. మండపాల వద్ద మైకు పర్మిషన్లు తీసుకుని భక్తిపాటలు మాత్రమే వినిపించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుందర్ సింగ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎల్రక్టికల్ ఏఈ పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉసూరుమనిపించిన వర్షం

ఆకివీడు: తుఫాన్ ప్రభావంతో గత ఐదు రోజులుగా ముసురు వాతావరణం ఏర్పడినప్పటికీ నియోజకవర్గంలో కనీస వర్షపాతం నమోదు కాలేదు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించినా జల్లుల వాన తప్ప కుండపోత వాన కురవలేదు. జూన్, జూలై నెలల్లో మాదిరిగానే ఆగస్టులో కూడా సాధారణ వర్షపాతం అంతంత మాత్రంగానే కురిసింది. తుఫాన్ ప్రభావం ఈ ప్రాంతానికి లేకపోయినప్పటికీ గోదావరి, కృష్ణ నదులు పొంగి ప్రవహించడం, తమ్మిలేరు, బుడమేరు, ఎర్రకాలువలు పొంగి ప్రవహించడంతో పంట, మురుగు కాల్వలు నిండుగా ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు మాత్రం జలమయమవుతున్నాయి.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

ఆకివీడు: భారతదేశం ఆధునిక విప్లవం వైపు పరుగులు తీయడానికి ఆద్యుడు మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు కొనియాడారు. రాజీవ్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక సాలిపేటలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు మోటుపల్లి గంగాధరరావు, వానపల్లి బాబూరావు, ఎండీ.మస్తాన్‌వలీ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ మాధవి, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరాజ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



ముంపునకు గురైన చేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు.

ఉండి: మండలంలో ముంపునకు గురైన వరిచేలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా మండలంలోని ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, ఉప్పులూరు తదితర గ్రామాల్లో పర్యటించిన బృందం ముంపునకు గురైన వరిచేలను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరిచేలు ముంపు నుంచి బయటపడుతున్నాయన్నారు. అయితే ఇదే సమయంలో వరినాట్లు నష్టపోకుండా రైతులు ఎకరాకు 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ చల్లుకోవాలన్నారు. అలాగే కార్బెండెజిమ్ 1గ్రాము, లేదా హెక్సాకొనాల్ 2.మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.ప్రతాప్ జీవన్, ఏఓ ఎస్.శ్రీనివాస్, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ పి.వినయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా పంట రుణాలు

పెనుగొండ: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు పంట రుణాలు విరివిగా ఇవ్వనున్నట్లు సొసైటీ చైర్ పర్సన్ నక్కా వేద వ్యాస శాస్త్రి అన్నారు. బుధవారం పెనుగొండ సొసైటీలో త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించి, సొసైటీ నిధులపై సమీక్ష నిర్వహించారు. పంట రుణాలతో పాటు, రైతులకు అందించాల్సిన ఇన్సూరెన్స్ త్వరలో అందిస్తామన్నారు.

తెలుగు భాషా దినోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం: భీమవరం పరిసర ప్రాంతాల్లో ఈనెల 22 నుంచి 29వ తేది వరకు తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గన్నాబత్తుల తులసమ్మ పెదతాత ట్రస్ట్ చైర్మన్ గన్నాబత్తుల శ్రీనివాస్, సంస్కార భారతి కార్యదర్శి చెరుకువాడ రంగసాయి అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం తెలుగు భాషా దినోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మన తెలుగు భాష ప్రపంచంలో గుర్తింపు పొందిందని, మన ప్రాచీన కవుల నుంచి ఆధునిక కవుల వరకు చేసిన రచనలు యుగాంతం వరకు చెరగని ముద్రలుగా నిలిచిపోతాయని అన్నారు. ఈ నెల 22న పీఎస్ఎం బాలికొన్నత పాఠశాలలో ప్రారంభ సభ జరుగుతుందని, పాలకోడేరు, వీరవాసరం భీమవరం మండలంలోని వివిధ కళాశాల, పాఠశాలలోని విద్యార్థులకు తెలుగు పద్యాలు, కవితలు, సామెతలు, పొడుపు కథలు, పురాణాలపై పోటీలను నిర్వహిస్తామని అన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామని అన్నారు. కలిగొట్ల గోపాలశర్మ, అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తెలుగు భాషా దినోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఉండి: రాష్ట్ర విద్యారంగంలో విద్యార్థులు దోపిడీకి గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ ఆరోపించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నేలపై కూర్చుని విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ కె.సూర్యనారాయణరాజుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బారిన పడి దోపిడీకి గురవుతున్నారని అన్నారు. అధికంగా ఫీజుల వసూలు చేస్తుంటే అధికారులు చూస్తూ ఉండిపోతున్నారని ఆరోపించారు. విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. మండలంలోని అర్తమూరులో పాఠశాల భవనం నిర్మించాలని, బాలుర వసతి గృహంలో తాగునీటిని అందించాలని, యండగండి జూనియర్ కళాశాలలో కుక్కల బెడద తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.రోహిత్, కె.గోవింద్, సతీష్, పి.రమేష్, ఎం.సంతోష్, రోహిత్, ఎస్.మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఆకివీడు: అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల సమ్మె కాలపు హామీలను ప్రభుత్వం అమలు చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కళ్యాణి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆకివీడు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని, ఎఫ్ఆర్‌సీ రద్దు చేయాలని, కొత్త ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలంతా పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.మార్తమ్మ, ఉపాధ్యక్షురాలిగా కృష్ణవేణి, కార్యదర్శి ఎస్.పైడేశ్వరి, సహాయకార్యదర్శిగా ఇరానీకుసుమ, కోశాధికారిగా రామాకుమారి, శ్యామలతో 21 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎండీ.హసీనా, కె.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న దృశ్యం

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వర కూ ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. డిపో పరిధిలోని ప్రయాణికులు 99592 25486 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలని కోరారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

ఉండి: దోమలను నివారిస్తేనే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డి.బెన్నీసామ్యూల్ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వైద్య సిబ్బంది స్థానిక హైస్కూల్లో అవగాహన కార్యక్రమం,ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బెన్నీసామ్యూల్స్ మాట్లాడుతూ దోమల ఆవాసాలనలు గుర్తించి వాటిని నివారిస్తేనే మనం క్షేమంగా బతకగలమని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం కె.పార్వతీ, కేపీ శ్రీనివాస్, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరం: గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీరవాసరంలో..

వీరవాసరం: ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వై.నాగబాబు, భీమవరం సబ్ యూనిట్ అధికారి సీహెచ్‌ఓ కె.ప్రసాద్, ఏఎస్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో బుధవారం నందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి జి.గీతా బాయి, జిల్లా మలేరియా అధికారి డా.వి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సిబ్బందితో దోమల నివారణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ డి.సుధాలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, ఏఓ డాక్టర్ భావన, ఏఎంఓ వై.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉండి: యండగండిలో దోమల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య బృందం



భీమవరం (ప్రకాశం చౌక్): దోమల నివారణ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఖాళీ స్థలాలతో పారిశుధ్య ఇబ్బందులు

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల కారణంగా పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సదరు స్థలాల యజమానులు తమ స్థలాలకు సరైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారవుతుంది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి, దోమలు పెరిగి పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. పట్టణంలో స్టేషన్‌పేట, రుస్తుంబాద, రాయిపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, చలువ పేట, ఎన్టీఆర్ కాలనీ, వీవర్స్ కాలనీ, నందమూరి కాలనీ, చినమామిడిపల్లి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలన్నీ ఇళ్ల మధ్యే ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. అలాగే చెత్త చెదారం చేరి, దోమలకు ఆలవాలంగా మారుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడటంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీంతో చుట్టు పక్కల వారు రోగాల భారిన పడుతున్నారు. వర్షపు నీరు ఈ స్థలాల్లో నిల్వ ఉండిపోయి, పిచ్చి మొక్కలు కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెద జల్లుతోంది. ఇలాంటి ఖాళీ స్థలాల వద్దకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. వైఎస్సార్ కాలనీ శివారు ఆదర్శ్ కాలనీ వద్ద, ఎన్టీఆర్ కాలనీ వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

కన్నెత్తి చూడని మునిపల్ అధికారులు

పట్టణంలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో గుర్తించి, ఆ స్థలాలు పూర్తి స్థాయిలో శుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా శానిటరీ అధికారులు ఈ విషయంపై శ్రద్ధ పెట్టాలి. అయితే అది జరగడం లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువ కావడంతో కొద్ది రోజుల క్రితం ఇలాంటి ఖాళీస్థలాలు శుభ్రం చేసుకోవాలని ప్రకటనలు ఇచ్చి మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకున్నారు. అంతకుమించి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదని పట్టణ వాసులు వాపోతున్నారు. పట్టణంలో మొత్తంగా 250 వరకూ ఇలాంటి ఖాళీ స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్టు అంచనా. చాలా స్థలాలకు సంబంధించి మున్సిపాల్టీకి చెల్లించాల్సిన పన్నులు కూడా కట్టడం లేదని సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిచ్చి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



రాయిపేట సికిలే స్కూల్ గ్రౌండ్ ఎదురుగా అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలం